## ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాల్సిందే: మండలి చైర్మన్

హైదరాబాద్: భూభారతి బిల్లుపై స్వల్పకాలిక చర్చ జరుగుతున్నది. ఈ సందర్భంగా భూభారతి చట్టం అమల్లోకి రాక ముందే పేపర్లలో ప్రకటనలు వచ్చాయని విపక్ష సభ్యులు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దృష్టి తీసుకొచ్చారు. అదేవిధంగా ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇలాంటి తప్పులు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి చైర్మన్ సూచించారు. అదేవిధంగా ప్రొటోకాల్ అమలులో అలసత్వం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రొటోకాల్‌పై ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు.


# దాసరి ఉదయం

https://epaper.udayamdaily.com

తెలుగు దినపత్రిక

సంపుటి : 13 సంచిక : 94 | జగిత్యాల | ఎడిటర్ - మొహమ్మద్ ఇమ్రాన్ | ఆదివారం 22, డిసెంబర్ 2024 | పేజీలు : 04 | వెల : 1.00/-





## అలాంటి ఘటనలు జరిగితే సినిమాలకు ప్రత్యేక రాయితీలు ఉండవు: సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా సంచలన ప్రకటన చేశారు. ప్రజల ప్రాణాలు పోయే ఘటనలు జరుగుతాయంటే సినీ పరిశ్రమకు ప్రత్యేక రాయితీలు కల్పించనని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బంది పెట్టిన ఎవరినీ ప్రభుత్వం వదిలి పెట్టదని హెచ్చరించారు. 'పుష్ప2: ది రూల్' మూవీ విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, బాలుడు తీవ్రంగా గాయపడి కోమాలో ఉన్నాడు. అసలు ఏం జరిగిందో ప్రభుత్వం ప్రకటన చేయాలని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ కోరారు. ఈ అంశంపై సీఎం స్పందించి ప్రకటన చేశారు. తాజా పరిస్థితులపై ప్రతిపక్షాల విమర్శలు, సినిమా పరిశ్రమ వ్యవహారశైలిపైనా మాట్లాడారు. "సంధ్య థియేటర్ ఘటన విషయంలో పోలీసులు వారి విధి నిర్వహణను సక్రమంగానే నిర్వహించారు. ఎప్పుడైతే అల్లు అర్జున్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారో రాజకీయ పార్టీలు, కొందరు వ్యక్తులు పైశాచికంగా, నీచంగా నన్ను తిడుతూ పోస్టులు పెట్టారు. సినిమా చూడటానికి వెళ్లిన కుటుంబంలో మహిళ చనిపోతే, 11వ రోజు వరకూ హీరో, ప్రొడ్యూసర్ ఎవరూ వారిని పరామర్శించలేదు. కనీసం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి దగ్గరికి కూడా పోలేదు. ఇది ఏ రకమైన మానవత్వం. ఇలా వ్యవహరించిన వారిని పోలీసులు తమ విధి నిర్వహణలో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఉద్యమాలు చేశామని చెప్పుకొనే వాళు„ పదేళ్లు మంత్రిగా చేసిన వ్యక్తులు సోషల్‌మీడియాలో అడ్డగోలుగా పోస్టులు పెట్టారు. ఉద్యమాల సమయంలో సినిమా షూటింగ్‌లు జరగొద్దని వీళ్లంతా దాడులు చేయలేదా? ఈ రోజు వాళ్లకు ఆ హీరో భగవత్ స్వరూపుడు అయ్యాడు. 'అలాంటి వ్యక్తిని పోలీసులు ముట్టుకుంటారా' అని ప్రశ్నిస్తున్నారు. ఓ మహిళ చనిపోయిన ఘటనలో విచారణకు పిలిస్తే దాన్ని కూడా ఈ రాజకీయ పార్టీలు తప్పుపడుతున్నాయి. ప్రభుత్వాన్ని బదనాం చేయాలని, ముఖ్యమంత్రిని తిట్టాలని నీచమైన భాష వాడారు." "సినిమా పరిశ్రమను ప్రోత్సహించాలని ఎవరూ ఇవ్వని విధంగా రాయితీలను మా ప్రభుత్వం కల్పించింది. టికెట్ ధరల పెంపునకు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ప్రజల ప్రాణాలు పోతుంటే కూడా వాళ్లను ఏమీ అనొద్దని అంటారేంటి? ఫిల్మ్‌స్టార్స్, సూపర్‌స్టార్, పొలిటికల్ స్టార్స్ హత్యలు చేసినా, వాళ్లను విచారించొద్దని మీరు చట్టం చేస్తానంటే అమలు చేస్తాం. బాబా సాహెబ్ అంబేడ్కర్ ఇచ్చిన చట్టం ప్రకారం సంధ్య థియేటర్ ఘటనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వాళ్లపై కేసులు పెట్టి విచారించాల్సిందే. బాధితులను ఆదుకోవాల్సిందే. ఒక్కరోజు అతను పోలీస్‌స్టేషన్‌కు పోయి వస్తే, ఏదో పెద్ద ప్రమాదం జరిగినట్టు కన్నీళ్లు కారుస్తున్నారు. ఈ సినీ ప్రముఖుల్లో ఒక్కరైనా ఆస్పత్రికి పోయారా? కానీ, ఆయన జైలు నుంచి రాగానే, వీళ్లంతా ఇంటికి క్యూ కట్టి, ఈ ప్రభుత్వాన్ని తిడుతున్నారు. ఆ పిల్లాడిని పరామర్శించేందుకు కొందరైనా సినీ ప్రముఖులు ముందుకు రాలేదంటే, సినీ ఇండస్ట్రీ, అందులోని ప్రముఖులు ఏం ఆలోచన చేస్తున్నారో, కోరుకుంటున్నారో తెలియదు" "అతన్ని ఒక్కరోజు అరెస్టు చేయగానే, హైకోర్టులో స్పెషల్ పిటిషన్, లంచ్ మోషన్ పెట్టారు. బెయిల్ కూడా వచ్చేలా చేశారు. రాత్రి జైలుకు వెళ్తే, ఉదయం బయటకు వచ్చారు. నేనేం చేయను. అది నా ఇల్లు కాదు. అలా అయి ఉంటే, వెళ్లలా? వద్దా? అన్నది నేను చెప్పేవాడిని. జైలు తలుపు నా చేతిలో లేదు. న్యాయ వ్యవస్థ ద్వారా వాళ్లు వెళ్లారు. రాజకీయ పార్టీలు, 10ఏళ్లుగా మంత్రులుగా పనిచేసిన వాళ్లు అతనిపై కేసులు ఎందుకు పెట్టారని నన్ను అడుగుతున్నారు. మా తమ్ముడికే కేసుల నుంచి మినహాయింపు ఉండదు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ఈ ప్రభుత్వం నడుచుకుంటుంది. ఆ పిల్లాడి ఆరోగ్యాన్ని మేం నిరంతరం పర్యవేక్షిస్తున్నాం." "నేను సినీ ప్రముఖులకు ఒక విషయం స్పష్టంగా చెబుతున్నా. అమానవీయ ఘటనలను ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం ఉపేక్షించదు. సినిమాలు తీసుకోండి, వ్యాపారం చేసుకోండి. డబ్బులు సంపాదించుకోండి. ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు తీసుకోండి. షూటింగ్‌లకు సంబంధించి ప్రత్యేక అనుమతులు కూడా తీసుకోండి. ప్రజల ప్రాణాలు పోతుంటే మాత్రం మా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. నేను కుర్చీలో ఉన్నంత వరకూ ఇలాంటి ఘటనలను ఉపేక్షించను. ప్రజల ప్రాణాలు పోయే ఘటనలు జరిగితే ప్రత్యేక మినహాయింపులు ఉండవు. తెలంగాణ ప్రజల ప్రాణాలు కాపాడటమే నా బాధ్యత, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినీ ప్రభుత్వం వదిలి పెట్టదు" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.




## బడిలో బంగ్లాదేశ్ పిల్లలుంటే చెప్పండి.. ఢిల్లీ స్కూళ్లకు సర్క్యులర్

ఢిల్లీ: పాఠశాలల్లో బంగ్లాదేశ్‌కు చెందిన పిల్లలుంటే.. తమ దృష్టికి తీసుకోవాలని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అక్కడి పాఠశాలలకు సర్క్యులర్ జారీ చేసింది. బడులలో విద్యనభ్యసిస్తున్న అక్రమ వలసదారుల పిల్లలను గుర్తించాలని ఆదేశాలు జారీ చేసింది. వారికి జనన ధ్రువీకరణ పత్రాలు జారీ కాని విషయం నిర్ధరించుకోవాలని సూచించింది. ఢిల్లీలో నివసిస్తున్న అక్రమ వలసదారులను గుర్తించాలని ఇదివరకే లెఫ్టినెంట్ జనరల్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడానికి సన్నద్ధమవుతున్న తరుణంలో అధికార ఆప్, భాజపా మధ్య వలసదారుల సమస్య అనే అంశం కీలకం కానుంది. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు చేసిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని అన్ని మున్సిపల్ జోన్‌లను కార్పొరేషన్ ఆదేశించింది. డిసెంబరు 31లోగా ఎంసీడీ డిప్యూటీ కమిషనర్ ద్వారా యాక్షన్ టేకప్ రిపోర్ట్‌ను సమర్పించాలని కోరింది. "ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ ఇస్తున్నప్పుడు అక్రమ వలసదారులను గుర్తించడానికి విద్యా శాఖ తగిన చర్యలు తీసుకుంటోంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వారి పిల్లలను గుర్తించేందుకు డ్రైవ్‌లను చేపట్టాలని కోరాము" అని డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. ఈ ఆదేశాలపై ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ స్పందిస్తూ అక్రమ వలసదారుల పేరుతో మున్సిపల్ కార్పొరేషన్ పూర్వాంచల్ నుంచి వలస వచ్చిన ప్రజలను అవమానపరుస్తోందని అన్నారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వారిని రోహింగ్యా, బంగ్లాదేశీ చొరబాటుదారుల జాబితాలో చేర్చారని మండిపడ్డారు. ఈ ఆర్డర్ ద్వారా ఉత్తరప్రదేశ్, బిహార్ నుంచి వలస వచ్చిన పేదలను అగౌరవపరచాలని..వారి నివాసాలు, దుకాణాలను కూల్చాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్వాంచలీలు తూర్పు ఉత్తర ప్రదేశ్, బిహార్ నుంచి ఢిల్లీకి వలస వచ్చారు. అక్కడి ఓటర్లలో దాదాపు 42 శాతం వారే ఉన్నారు. బురారీ, లక్ష్మీ నగర్, ద్వారక వంటి కీలక ప్రాంతాలతో సహా ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాలలో వీరి ప్రభావం అధికంగా ఉంది.

## రైతుబంధులో కోతలు విధిస్తామని మేం చెప్పలేదు: మంత్రి తుమ్మల


హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. "మేం ఇచ్చిన నోట్‌లో రైతు భరోసాపై ఏమీ చెప్పలేదు. గత ప్రభుత్వంలో జరిగిన విధివిధానాలే సభ ముందు ఉంచాం. భారాస ఏది చెబితే.. అది అమలు చేయాలనే ఆలోచన వారికి ఉంది. ఏ పంటకు ఎంత ఇస్తామనేది ఇంకా నిర్ణయించలేదు. సభలో సభ్యుల సూచనల తర్వాతే నిర్ణయిస్తాం. పత్తి, చెరకుకు ఏం చేయాలనేది సభ్యులు చెబితే.. చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రైతుబంధులో కోతలు విధిస్తామని మేం చెప్పలేదు. ప్రజలు, సభ్యుల అభిప్రాయం ప్రకారం విధివిధానాలు నిర్ణయిస్తాం" అని తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.






## ఉత్తరాంధ్రలో వర్షాలు.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం చంద్రబాబు

అమరావతి: అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సీఎంవో అధికారులు ఆయా జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులపై ముఖ్యమంత్రికి వివరించారు. కలెక్టర్లు, జిల్లా స్థాయిలో అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. భారీవర్షాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు.. స్కూళ్లకు సెలవు ప్రకటించినట్లు సీఎంకు వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయని.. వర్షాల అనంతరం పంటనష్టం వివరాలు సేకరించి రైతులకు సాయం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు. భారీవర్షాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నదాతలకు చేరేలా చూడాలని సూచించారు. అన్ని స్థాయిల్లో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.




## భారాస పాలనలో కూలిపోయే ప్రాజెక్టులు కట్టారు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: భారాస హయాంలో గరిష్ఠంగా 14 గంటల కరెంట్ మాత్రమే వచ్చేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఒక సబ్‌స్టేషన్‌లో లాగ్ బుక్ పరిశీలిస్తే ఈ విషయం తెలిసిందని చెప్పారు. ఆ 14 గంటల్లోనూ ఐదారు సార్లు కోతలుండేవని విద్యుత్ సిబ్బంది చెప్పేవారన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. "భారాస 24 గంటల విద్యుత్ సరఫరా చేయలేదు.. ఆధారాలు పంపిస్తాం. నల్గొండ జిల్లాలో ఆ పార్టీ హయాంలో కొత్తగా ఒక ఎకరా సాగులోకి వచ్చినా.. నేను రాజీనామా చేస్తా. ఉచిత విద్యుత్ అందించింది కాంగ్రెస్.. దాని పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దే. భారాస పాలనలో నీళ్లు, విద్యుత్.. ఏమీ ఇవ్వలేదు. వాళ్ల పాలనలో కూలిపోయే ప్రాజెక్టులు కట్టారు. మిషన్ భగీరథ ద్వారా కుళాయి నీళ్లు వచ్చాయని ప్రజలు చెబితే.. మరో సారి ఓట్లు అడగం. మిషన్ భగీరథలో రూ. 50 వేలకోట్లు తినేశారు" అని కోమటిరెడ్డి ఆరోపించారు.

**అలా ఎలా మాట్లాడతారు..?: హరీశ్‌రావు...** మంత్రి ఆరోపణలను భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండించారు. "మిషన్ భగీరథకు అయిన ఖర్చు రూ. 28 వేల కోట్లు. రూ. 50 వేల కోట్లు తిన్నారని మంత్రి కోమటిరెడ్డి ఎలా మాట్లాడతారు? మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి. కాళేశ్వరం ద్వారా నల్గొండ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీళ్లు అందించాం. నల్గొండలో వైద్య కళాశాల పెట్టింది కేసీఆర్. ఉమ్మడి నల్గొండలో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాం" అని హరీశ్ రావు అన్నారు.



## ప్రకాశం జిల్లాలో స్వల్ప భూప్రకంపనలు

తాళ్లూరు: ప్రకాశం జిల్లాలోని ముండ్లమూరు మండలంలో స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. శంకరాపురం, పోలవరం, పసుపుగల్లు, ముండ్లమూరు, వేంపాడు, మారెళ్ల, తూర్పుకంభంపాడులో భూమి కంపించింది. ముండ్లమూరు పాఠశాల నుంచి విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఉద్యోగులు బయటకు వచ్చారు. తాళ్లూరు మండలంలో స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. తాళ్లూరు, గంగవరం, రామభద్రాపురం, ఇతర గ్రామాల్లో రెండు సెకన్ల పాటు భూమి కంపించింది.

## బస్సు ఎక్కితే నో టికెట్... ఎప్పటినుంచంటే...




అమరావతి: మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇవాళ (శనివారం) ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి మంత్రి వర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘం నియమకం అయింది . హోం మంత్రి అనిత, గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సభ్యులుగా ఉప సంఘం ఏర్పాటైంది. రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కన్వీనర్‌గా ఈ ఉప సంఘం ఉండనుంది. ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్న పలు రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వానికి మంత్రి వర్గ ఉప సంఘం నివేదిక ఇవ్వనుంది. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఈరోజు మంత్రి వర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం నియమించింది. తాజాగా ఈ పథకం అమలుపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వచ్చే సంక్రాంతి నుంచే ఫ్రీ జర్నీ అమలు చేస్తామని, దీనికోసం ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోందని చెప్పిన విషయం తెలిసిందే.

**సమూల మార్పులు తీసుకువస్తాం: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,...** ఆర్టీసీ డిపోల సమూల మార్పులు తీసుకువస్తామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆరు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను ఇవాళ(శనివారం) మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర. ప్రారంభించారు. ఆర్టీసీలో ఉత్తమ సేవలు అందించిన కార్మికులకు నగదు పారితోషకాలను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి రాంప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు.


ఆర్టీసీ డిపో నూతన భవనాలు శ్రీకారం చుట్టామని అన్నారు. జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ మైదానం ఏర్పాటు చేస్తామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఉదయం

ఆదివారం 22 డిసెంబర్ 2024

# అసమాన గణిత శాస్త్రజ్ఞుడు రామానుజుడు - డిసెంబర్ 22.. శ్రీనివాస రామానుజన్ జయంతి


ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ గణితశాస్త్ర సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అత్యుత్తమ అ'గణిత' మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం. అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (డిసెంబర్ 22, 1887ఏప్రిల్ 26, 1920) భారత దేశానికి చెందిన గణిత శాస్త్రవేత్త. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. ఇతడికి పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. పదమూడేళ్లకే ఎస్ఎల్ లోనీ త్రికోణమితిపై రాసిన పుస్తకాన్ని జీర్ణించుకోవడమే కాదు తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించాడు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టకపోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాసులోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరాడు. అక్కడ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు. 1729 సంఖ్యను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు. తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేశారు. రామానుజన్ అనారోగ్యంతో హాస్పిటల్లో వున్నప్పుడు, హార్డీ ఆయనను పలుకరించటానికి వెళ్లి మాటల మధ్యలో తాను వచ్చిన కారు నంబరు 1729, దాని ప్రత్యేకత ఏమైనా ఉన్నదా ? అని అడిగారు. అందుకు రామానుజన్ తడుముకోకుండా ఆ సంఖ్య ఎంతో చక్కని సంఖ్య అని, ఎందుకంటే రెండు విధాలుగా రెండు ఘనముల మొత్తముగా వ్రాయబడే సంఖ్యా సమితిలో అతి చిన్నసంఖ్య అని తెల్పారు. (1729 = 1ñ3 o 12ñ3 = 9ñ3 o 10ñ3 ). ఈ సంఘటన గణితంపై ఆయనకున్న అవ్యాజమైన అనురాగానికి, అంకిత భావానికి నిదర్శనం. మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అవలోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వాడు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం.. 15ఏళ్లకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్యూబ్రిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరిగేయకుండా వాటి సాధనలను అవలోకగా కనుక్కున్నాడు. 3,500 గణిత ఫలితాలను సమీకరించిన రికార్డును సొంతం చేసుకున్న మేధావి. 1903లో మద్రాసు విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్ వచ్చింది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చి పడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశాడు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరాడు. చిత్తు




కాగితాలను కూడా బహుజాగ్రత్తగా వాడుకుంటూ గణితమే లోకంగా బతికేవాడు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వవిద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా.వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్యర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెంల్డ్ హార్డి (1877-1947)కి పంపారు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించాడు. జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ప్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి. 33 ఏళ్ళకే ఆయన 1926, ఏప్రిల్ 26న మరణించాడు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కాడు. రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2014ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజసిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వాడు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విదేశీ ప్రొఫెసర్ హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# డిసెంబర్ 22...జాతీయ గణిత దినోత్సవం




20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన, భారతీయ గణిత చరిత్రకు మెరుగులు దిద్దిన శ్రీనివాస రామానుజన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతియేటా డిసెంబర్ 22ను జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపు కొంటున్నారు. గణిత శాస్త్రములో ఆర్యభట్ట, భాస్కరాచార్యులు తరువాత భారత దేశానికి గొప్ప పేరు తెచ్చిన మేధావి భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ (1887 డిసెంబర్ 22 - 1920 ఏప్రిల్ 26). తన విలక్షణ అసమాన మేధాసంపత్తితో అనన్య సామాన్యమైన కృషిచేసి భారతీయ కీర్తి పతాకాన్ని దశదిశలా ఎగరవేసిన మహా గణితజ్ఞుడు శ్రీనివాస రామానుజన్. ఆయన జీవించింది 32 అయినా 3900పైగా సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అపరగణిత మేధావి. ఆయన సిద్ధాంతాలపై నేటికీ ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతుండడం విశేషం. గణితం వేద కాలము నుండి భారతీయ సంప్రదాయంలో భాగమేనని మన వేద గణితం ద్వారా మనకు తెలుస్తున్నది. గణితం ప్రాచీన భారత దేశంతో పాటు ప్రాచీన ఈజిప్టు, మెసపు టేమియా, ప్రాచీన చైనా, ప్రాచీన గ్రీకు నాగరికతలలో ఎక్కువగా అభివృద్ధి చెందింది. ప్రపంచ వ్యాప్తంగా గణితము అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఎంతో ఉంది. సంఖ్యామానానికి పట్టుకొమ్మ అయిన సున్నా భారతీయుల ఆవిష్కరణే. ప్రాచీన భారతీయులు గణితంలో ఎన్నో విషయాలు కనుగొన్నారు. సంఖ్యలను కనుగొనడంలో చాల కృషి చేశారు. దశాంశ పద్ధతిని గుర్తించిన మొదటివారు భారతీయులే. ఆర్యభట్ట కాలాన్ని భారతీయ గణిత శాస్త్రానికి స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఇది భాస్కరా చార్యుని వరకు అప్రతిహతంగా సాగింది. భాస్కరాచార్యుని తర్వాత కాలంలో బహు విదేశీ దండ యాత్రల వల్ల గణితం కళ తప్పింది. అనువాదాలు, వ్యాఖ్యానాలు తప్ప పెద్దగా స్వతంత్ర గణిత సారస్వతం ఏదీ ఆవిష్కరణ కాలేదు. ఆ స్థితిలో మళ్లీ భారతీయ గణిత చరిత్రకు మెరుగులు దిద్దిన మేధావి శ్రీనివాస రామానుజన్. గణితంపై అనేక గ్రీకు అరబిక్ గ్రంథాలు 12వ శతాబ్దం నుండి లాటిన్‌లోకి అనువదించ బడ్డాయి. ఇది మధ్యయుగంలో ఐరోపాలో గణిత శాస్త్రం మరింత అభివృద్ధికి దారితీసింది. పురాతన కాలంమధ్య యుగాల వరకు, గణితశాస్త్ర ఆవిష్కరణ కాలాలు తరచుగా శతాబ్దాల స్తబ్దతతో అనుసరించ బడ్డాయి. 15వ శతాబ్దంలో పునరుజ్జీవనోద్యమం ఇటలీలో ప్రారంభమై , కొత్త గణిత శాస్త్ర పరిణామాలు, కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల పరంపర పెరుగుతున్న వేగంతోఈ రోజు వరకు కొనసాగుతోంది. ఆధునిక కాలపు తొలినాళ్ళలో పశ్చిమ ఐరోపాలో గణిత శాస్త్రం అభివృద్ధి వేగం పుంజుకుంది. 17వ శతాబ్దం లో న్యూటన్, లీబ్నిజ్ ల కలన గణితం అభివృద్ధి చెందిది. గణితంలో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. లియొన్‌హార్డ్ ఆయిలర్ 18వ శతాబ్దంలో అత్యంత ప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు, అనేక సిద్ధాంతాలు, ఆవిష్కరణలకు తోడ్పడ్డాడు. 19వ శతాబ్దంపు తొలి గణిత శాస్త్రజ్ఞులలో ఒకడైన కార్ల్ ఫ్రెడ్రిక్ గాస్... బీజగణితం, విశ్లేషణ, అవకలన జ్యామితి, మాతృక సిద్ధాంతం, సంఖ్యా సిద్ధాంతం, గణాంకాలు వంటి రంగాలలో అనేక రచనలు చేశాడు. శ్రీనివాస రామానుజన్, కల్యం పూడి రాధాకృష్ణ రావు, సుజాత రాందొరై, పి.సి. మహల నోబిస్, మడకా హరిప్రసాద్ లాంటి ప్రముఖ భారతీయ గణిత శాస్త్రజ్ఞులు విశేష కృషి చేశారు. 2012 ఫిబ్రవరి 26 న మద్రాస్ విశ్వవిద్యాలయంలో జరిగిన రామానుజన్ 125వ జయంతి ప్రారంభ వేడుకల్లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. అలాగే 2012 ను జాతీయ గణిత సంవత్సరంగా జరుపుకుంటామని ప్రకటించారు. అలా 2012 నుంచి ప్రతీ సంవత్సరం డిసెంబర్ 22 ను జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. యువతలో శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించడం, గణిత శాస్త్రంలో పరిశోధనలను ప్రోత్సహించడం, ఆర్థిక, విజ్ఞాన శాస్త్రం, ఇతర విభాగాలలో దాని అనువర్తనాన్ని అన్వేషించడంతో పాటు గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ ను స్మరించుకుని, గౌరవించటం జాతీయ గణిత దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. భారత దేశంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలలో జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకుంటారు. రామానుజన్ 75వ జన్మదినోత్సం సందర్భంగా 1962లో కేంద్ర సర్కార్ పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. అత్యంత చిన్న వయసులోనే గణిత శాస్త్రంలో తనకున్న పట్టును చాటుకున్న రామానుజన్ మ్యాథ్య్ జీనియస్ గా పేరుగాంచిన ఆయన జీవిత ఆధారంగా ద మ్యాన్ హూ నో ఇన్ఫినిటీ పేరుతో సినిమా కూడా విడుదలైంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కాకలు తీరిన రాజకీయ నేత కాకా - డిసెంబర్ 22...గడ్డం వెంకట స్వామి వర్ధంతి



రాజకీయాల్లో కాకలు తీరిన నేతగా... 'కాకా'గా చెరగని ముద్ర వేసిన కేంద్ర మాజీ మంత్రి, సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి గడ్డం వెంకటస్వామి(92). భారత రాజ్యాంగ రూపకర్త బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కలసి పనిచేసిన వారిలో కాకా ఒకరు. కార్మిక నేతగా ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. భారత దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి అతి సమీపానికి వెళ్ళి, కొందరి స్వార్థం, కుట్రల మూలంగా, ఆ పదవి పొందలేక పోయానని కాకా పదే పదే చెపుతుండే వారు. హైదరాబాద్ లో ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేయించి గుడిసెల వెంకట స్వామిగా గుర్తింపు పొందారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు మొదటిసారి ప్రతిపాదన చేసిన వ్యక్తి వెంకటస్వామి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, పిసిసి అధ్యక్షుడిగా, ఏఐసిసి బాధ్యునిగా, ఎంపీగా , కేంద్ర మంత్రిగా, ఆయన అందించిన బహుముఖ సేవలు నిత్య జ్ఞాపకాలుగా మిగిలాయి. గడ్డం వెంకటస్వామి 5 అక్టోబర్ 1929న హైదరాబాద్ లో జన్మించారు. చిన్న వయసులోనే నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. మొదట ఆర్యసమాజ్‌లో, ఆ తర్వాత రామానందతీర్థ శిష్యుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. సాయుధ పోరాట సమయంలో జైలుకెళ్లిన కాకా.. హైదరాబాద్ విలీనం అనంతరం రాజకీయాలు వదిలేసి కుటుంబ పోషణ కోసం కూలీ పని చేశారు. అప్పుడే కార్మిక నాయకుడిగా ఎదిగారు. హైదరాబాద్‌లో నిలువనీడ లేకుండా ఉన్న పేదల కోసం ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసి వారి కోసం పోరాడారు. ఆర్థికంగా బలపడ్డాక మళ్లీ రాజకీయాల్లోకి వచ్చిన కాకా అనేక పదవులు అలంకరించారు. 1957- 62 మరియు 1978-84 ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ఉన్నారు. 1967లో 4 వ లోకసభకు ఎన్నికైయ్యారు. 1969-71 వరకు ప్రజా పద్దుల కమిటీ సభ్యుడు. అవిభక్త కరీంనగర్ జిల్లా పెదపల్లి లోకసభ నియోజకవర్గంనుండి పార్లమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. 1971లో 5వ లోకసభకు (2వ పర్యాయం), 1977లో 6వ లోకసభకు (3వ పర్యాయం), 1989లో 9వ లోక్ సభ (4వ పర్యాయం), 1991లో 10వ లోకసభకు (5వ పర్యాయం), 1996లో 11వ లోకసభకు (6వ పర్యాయం), 2002-2004 అధ్యక్షుడి గా, ఎ.ఐ.సి.సి. ( ఎస్ సి %డ% ఎస్ టి ), 2004లో 14వ లోకసభకు (7వ పర్యాయం), ఎన్నికైయ్యారు. 1978 - 1982 లేబర్ మరియు సివిల్ సప్లైస్, ఆంధ్ర ప్రదేశ్ క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 1973 - నవంబర్ 1973 వరకు లేబర్ మరియు పునరావాస కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. నవంబర్ 1973-మార్చి 1977 వరకు సప్లై అండ్ రీహాబిలిటేషన్ కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. 21 జూన్ 1991 నుండి 17 జనవరి 1993 గ్రామీణాభివృద్ధి కేంద్ర మంత్రిగా, 18 జనవరి1993 నుండి ఫిబ్రవరి 1995 టెక్స్టైల్స్ కేంద్ర సహాయమంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్)గా, 10 ఫిబ్రవరి నుండి 1995-15 సెప్టెంబర్ 1995 వరకు టెక్స్టైల్స్ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 15 సెప్టెంబర్. 1995 నుండి 10 మే 1996 వరకు కార్మిక శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 20 ఫిబ్రవరి 1996-16 మే 1996 కార్మిక మరియు వస్త్రాల శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. అలాగే డిప్యుటి లీడర్ కాంగ్రెస్ పార్లమెంట్ పార్టి, లోకసభ మెంబర్, కమిటి ఆన్ ఎనర్జి , మెంబర్, కమిటి ఆన్ ఇన్ స్టాలేషన్ ఆఫ్ పోట్రైస్ / స్టేటస్ ఆఫ్ నేషనల్ లీడర్స్, పార్లమెంటేరియన్ ఇన్ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ మెంబర్, కమిటి ఆన్ ఎతిక్స్ మెంబర్, కన్సులేటివ్ కమిటి, మినిస్ట్రీ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ మెంబర్, స్టాండింగ్ కమిటి ఆన్ ఎనర్జజీ పని చేశారు. కాకా మొదటి కుమారుడు గడ్డం వినోద్, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, రెండవ కుమారుడు గడ్డం వివేకానందా, పెద్దపెల్లి నియోజక వర్గానికి ఎం.పి.గా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారునిగా పనిచేశారు. ఆయన 2014, డిసెంబరు 22వ తేదీ హైదరాబాదులో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఏడు నందులను పొందిన కాశీ విశ్వనాథ్ - డిసెంబర్ 22 చిలుకోటి కాశీ విశ్వనాథ్ వర్ధంతి



చిలుకోటి కాశీ విశ్వనాథ్ కథా రచయిత, నటుడు. 7 నంది అవార్డులు ఆయన సొంతం చేసుకున్న ప్రతిభా శాలి. వెయిట్ లిఫ్టింగ్ లో దిట్ట. ఒకే ఏడాది 11 చిత్రాలు చేసిన ఘనత ఆయనదే. ఆయన వ్రాసిన "ఓ వర్షం కురుసిన రాత్రి" కథకు స్పందించి, ప్రఖ్యాత రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి స్వయంగా ఆయన యింటికి వెటళ్ళి అభినందించడం విశేషం. వివిధ రంగాల్లో చూపుతున్న ప్రతిభకు నిదర్శనంగా ఆసియా ఖండం విశిష్ట వ్యక్తిగా ఏషియా బుక్‌లో స్థానం పొందడం గమనార్హం. చిరంజీవి, శోభన్‌బాబు, రాజేంద్ర ప్రసాద్, కృష్ణ, సావిత్రి, అంజలి, షావుకారు జానకి, శ్రీదేవి, జయప్రద లాంటి ఎందరో ప్రముఖ నటులతో కలిసి పని చేశారు. దాదాపు 70 చిత్రాలకు రచయితగా ఆయన ఉన్నారు. అగ్రశ్రేణి దర్శకులు రేలంగి నరసింహారావు, రాజాచంద్ర, విజయ బాపినీడు, దాసరి నారాయణరావు వంటి ప్రముఖ దర్శకుల వద్ద చిత్రాలకు రచయితగా పని చేసిన ఆయన మంచిపేరు తెచ్చు కున్నారు. విశ్వనాథ్ విశాఖపట్నంలో కోటి అప్పలస్వామి, బుచ్చమ్మ దంపతులకు 1946లో జన్మించారు. ఆయన పూర్తి పేరు చిలుకోటి కాళీ విశ్వేశ్వరరావు. ఆయన పేరును కాశీ విశ్వనాథ్ గా తన పాఠశాల రోజులలో తెలుగు ఉపాధ్యాయులు మార్చారు. ఆయన విశాఖపట్నం లోని ఎ.వి.ఎన్ కళాశాలలో చదివారు. ఆయన ఆంధ్రా విశ్వ విద్యాలయంలో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో క్రీడలలో, రంగస్థల ప్రదర్శనలలో కూడా పాల్గొన్నారు. అతను ఒక జాతీయ వెయిట్ లిఫ్టర్ మరియు మూడు సార్లు విశ్వవిద్యాలయ ఛాంపియన్షిప్స్ గెలిచారు. ఆయన రాష్ట్రస్థాయి పోటీలకు కూడా వెళ్ళారు. విద్యాభ్యాసం తరువాత ఆయన 1966 లో విశాఖపట్నం పోర్టు ట్రస్టులో అకౌంటెంట్ గా ఉద్యోగం చేశారు. ఆయన 1968 లో తన రచనా ప్రస్థానాన్ని , అలాగే సినిమా ప్రస్థానాన్ని "రామాయణంలో పిడకలవేట" సినిమాతో 1980లో ప్రారంభించారు. అయన సుమారు 131 సినిమాలకు స్క్రిప్ట్, సంభాషణలు వ్రాసారు. సుమారు 120 కథలు, 28 నవలలు, 43 నాటికలు, అనేక సినిమాలకు కథలు వ్రాసారు. ఆయన 37 సినిమాలలో నటించారు. ఆ కారణంగా సినీ పరిశ్రమలోని అందరు దర్శకులు, నిర్మాతలు నటీ నటులతో ఆయనకు మంచి పరిచయాలు ఉండేవి. ఆయన 52 సినిమాలలో నటించారు. "కళా సాగర్, మానవత్వానికి మరో కోణం, ట్రెండ్ మారింది" వంటి తన నాటకాలకు నంది అవార్డులు కూడా అందుకున్నారు. ఆయనకు మొత్తం ఏడు నంది అవార్డులు వచ్చాయి. వాటిలో మూడు నందులు సినిమా కథలకు, మూడు నందులు నాటకాలకు, ఒక నంది దర్శకత్వానికి వచ్చాయి. ల 1980 లో సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, ఎన్టీఆర్ స్మారక అవార్డు అందుకున్నారు. చిలుకోటి కాశీ విశ్వనాథ్ 2015 డిసెంబరు 22న గుండెపోటుతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కేజీబీవీలు, యూఆర్ఎస్‌ల్లో కుంటుపడిన బోధన

సిరిసిల్ల : సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె ప్రభావం బోధనపై పడింది. జిల్లాలోని కేజీబీవీలు, యూఆర్ఎస్‌లో విద్యాబోధన నిలిచిపోయింది. మండల విద్యాశాఖ కార్యాలయాలు తెరవడం లేదు. భవిత కేంద్రాలు మూతపడ్డాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది.విద్యాశాఖలో అనుబంధంగా గత 19 సంవత్సరాలుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది పని చేస్తున్నారు. డీపీవో సిబ్బంది అయిదుగురు, కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులు, సిబ్బంది 294, సీఆర్‌పీలు 50, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 13, ఐఈఆర్‌పీలు 13, మెసెంజర్స్ 13 మంది పని చేస్తున్నారు. వీరంతా సమ్మెబాట పట్టడంతో జిల్లాలోని 13 కేజీబీవీలతోపాటు ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల (యూఆర్ఎస్), భవిత కేంద్రాల్లో బోధన కుంటుపడింది. జిల్లాలోని కొన్ని కేజీబీవీల్లోనే ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తికాలేదు. పాఠాలు చెప్పేవారు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రతి కేజీబీవీలో ఇద్దరు టీచర్లు, ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉంటున్నారు. విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుండగా, సిబ్బంది మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో సిలబస్ పూర్తి చేసి రివిజన్, ప్రత్యేక తరగతుల తో పాటు స్లిప్ టెస్టులు నిర్వహించే సమయంలో కేజీబీవీ ఉద్యోగులు సమ్మెబాట పట్టడం తీవ్ర ప్రభావం చూపనుంది.

**సీఆర్‌పీల పనులు ఎలా...**

జిల్లాలో 33 క్లస్టర్లు ఉండగా 50 మంది సీఆర్‌పీలు పని చేస్తున్నారు. వీరిని కాంప్లెక్స్ హెచ్ఎంలకు కేటాయించారు. ఒక్కో సీఆర్‌పీ వారి క్లస్టర్ పరిధిలోని ఒకటి లేదా రెండు పాఠశాలలను సందర్శించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాల సమాచారాన్ని పరిశీలిస్తుంటారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తారు. పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూడైస్‌లో నమోదు చేస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లోని ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినపుడు ఆ క్లస్టర్ పరిధిలోని సీఆర్‌పీ ఆ పాఠశాలను నడిపిస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం, పాఠశాల ఖర్చుల వివరాలు సేకరించి జిల్లా విద్యాధికారులకు అందజేయడం చేస్తుంటారు.

**ఇవీ డిమాండ్‌లు...**సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. అప్పటి వరకు పే స్కేలు ఇవ్వాలి.

ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి.ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు చెల్లించాలి.ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలి.పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు 12 నెలల వేతనం ఇవ్వాలి. ఉద్యోగులందరికీ రీ ఎంగేజ్ విధానాన్ని తొలగించాలి.

**హామీలు నెరవేర్చాలి**

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిరవధిక సమ్మె చేస్తున్నాం. ప్రస్తుతం అందరూ సమ్మెలోకి వస్తే విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని, ప్రతి కేజీబీవీలో నలుగురు పని చేస్తున్నారు. ప్రభుత్వం మరో మూడు రోజుల్లో స్పందించి డిమాండ్లను నెరవేర్చకుంటే పూర్తి స్థాయి సమ్మెలోకి వెళ్తాం. కేజీబీవీలు, యూఆర్ఎస్‌లకు తాళం వేసి విద్యాశాఖ కార్యాలయంలో అప్పగిస్తాం.ఇప్పపూల దేవేందర్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

# నేత.. నీటిరాత..!

నల్గొండ: ఉమ్మడి జిల్లా రైతులకు సాగునీటి ప్రాజెక్టుల పనులు ఊరట కలిగిస్తున్నాయి. యాసంగి పంటకాలానికి సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టు కింద వారాబందీ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నారు. నాగార్జునసాగర్, పులిచింతల, మూసీ ప్రాజెక్టులతో ఏటా ఉమ్మడి జిల్లాలో 15 లక్షల ఎకరాల మేర వివిధ పంటలకు సాగునీటిని అందుతున్నాయి. వానాకాలంలో 12.20 లక్షల ఎకరాల్లో వరి, 1.50 లక్షల ఎకరాల్లో మిగిలిన పంటలు సాగవగా.. యాసంగిలోనూ గరిష్ఠంగా 14 లక్షల ఎకరాల వరకు సాగుచేయనున్నారు. **పురోగతిలో ప్రాజెక్టులు**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజుర్‌నగర్ నియోజకవర్గంలో సాగర్ ఎడమకాల్వపై ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తి చేయనున్నారు. రూ.817 కోట్లతో పులిచింతల నుంచి ముత్యాల బ్రాంచ్ కెనాల్(ఎంబీసీ)కు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించనుండగా.. ప్రస్తుతం భూసేకరణ పనులు జరుగుతున్నాయి. జాన్‌పాడులో రూ.118 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులు, మేళ్లచేరువు, చింతలపాలెంతో పాటు మిగిలిన 6 చోట్ల సుమారు రూ.500 కోట్లతో ఎత్తిపోతల పథకాల పనులు పురోగతిలో ఉన్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నల్గొండ నియోజకవర్గ కేంద్రంలో మొత్తం రూ.50 కోట్లతో నర్సింగ్‌భట్ల, కంచనపల్లి-బక్కతాయికుంట, కనగల్ మండలంలోని పొనుగోడు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేశారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) పథకానికి ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,540 కోట్లు పెంచి ఆ నిధులు మంజూరు చేశారు. బేరింగ్ బిగింపు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండ్లిపాకల నిర్మాణాల పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మునుగోడులో చర్లగూడెం, లక్ష్మణాపురం రిజర్వాయర్లకు కృష్ణానీటిని, పిల్లాయిపల్లి కాలువలోకి గోదావరి నీటిని తరలించనున్నారు. మొత్తం 669 చెరువులతో పాటు వాగులపై చెక్‌డ్యాంలు, మట్టితో కూడిన మత్తళ్లు, శేషులేటి వాగు, వెల్మకన్నె ఫీడర్ ఛానల్‌లను అభివృద్ధి చేస్తే నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించే అవకాశం ఉంది.భువనగిరిలో బునాదిగాని కాలువ పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.269 కోట్లు మంజూరు చేయగా పనులు త్వరలో జరగనున్నాయి. కాళేశ్వరం ప్యాకేజీ-16లో భాగంగా నృసింహసాగర్ జలాశయం నుంచి ముత్తిరెడ్డి గూడెం, రాయగిరి చెరువులతో పాటు స్థానికంగా ఉన్న 10 చెరువుల్లోనూ నీళ్లు నింపనున్నారు. భవిష్యత్తులో కుడి కాలువ ద్వారా బీబీనగర్, భువనగిరి పెద్దచెరువులను నింపేలా కార్యాచరణ సిద్ధమవుతుంది. మూసీపై నిర్మాణంలో ఉన్న ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాల్వలకు రూ.565 కోట్ల నిధులను మంజూరు చేశారు. నాగార్జునసాగర్‌లో ఇప్పటికే డీ-8, డీ-9 కాల్వల సమస్య పరిష్కారం కావడంతో రంగుండ్ల, కుంకుడు చెట్టు గ్రామాల పరిధిలో ఉన్న 7 వేల ఎకరాల్లో, త్వరలో నెల్లికల్ ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయితే 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

మిర్యాలగూడలో గత మూడేళ్ల నుంచి సుమారు రూ.500 కోట్లతో దాదాపు 8 వేల ఆయకట్టుకు సరిపడా కృష్ణానదిపై వాడపల్లి-బోత్కలపాలెం, అడవిదేవులపల్లి మండలంలోని దున్నపోతుల గండి, మూసీ నదిపై కొండ్రపోల్-కేశవాపురం ఎత్తిపోతల పథకాల పనులు జరుగుతున్నాయి.దేవరకొండలో ఎస్సెల్బీసీ సొరంగం మార్గం పనులు ముందుకు సాగుతున్నాయి. రూ.30 కోట్లతో డిండి ఎత్తిపోతలతో పాటు పెండ్లిపాకల, నక్కలగండి పనులు తుది దశలో ఉన్నాయి.

ఉదయం



# మెట్రో విస్తరణకు త'రుణం.. కేంద్రం అనుమతే కీలకం'

హైదరాబాద్ : మెట్రోరైలు రెండోదశకు నిధుల లభ్యత పెద్ద సమస్య కాదంటోంది హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ (హెచ్‌ఏఎంఎల్). ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇస్తే అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థలు నిధుల మంజూరుకు సుముఖంగా ఉన్నాయని మెట్రో వర్గాలు అంటున్నాయి. 2 కంటే తక్కువ శాతానికే రుణం మంజూరు చేయడంతోపాటు పదేళ్ల మారటోరియం, 30 ఏళ్లపాటు చెల్లింపులకు అవకాశం ఉండటంతో ప్రాజెక్ట్ ఆరంభమైన మొదటిరోజు నుంచే లాభాల్లో నడిచే ఆస్కారం ఉంటుందని హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు.

**పదేళ్లదాకా వెసులుబాటు**

జైకా వంటి సంస్థలు ప్రభుత్వ ప్రాజెక్టులకు ఇచ్చే రుణాలపై పదేళ్లపాటు మారటోరియం ఉంటుంది. అంటే రుణం పదేళ్ల వరకు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆ తర్వాత 30 ఏళ్లపాటు చెల్లిస్తే సరిపోతుంది. అప్పటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నోరెట్లు పెరుగుతుంది. కాబట్టి తిరిగి




చెల్లింపులు పెద్ద భారం కావు అనేది మెట్రో వర్గాల మాట.

**రుణాలు ఎవరిస్తారంటే..**

మెట్రోరైలు రెండోదశలో 76.4 కి.మీ. మార్గానికి రూ.24,269 కోట్ల అంచనాలతో సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు రూపొందించి ప్రభుత్వం కేంద్రానికి పంపింది. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో చేపట్టేలా ప్రతిపాదించారు. ప్రాజెక్ట్ వ్యయంలో ఈక్విటీలో 30 శాతం రాష్ట్రం, 18 శాతం కేంద్రం భరించేలా ప్రతిపాదించారు. మిగిలిన దాంట్లో 48 శాతం అంటే రూ.11,693 కోట్లు రుణాల ద్వారా సమకూర్చుకోవాలనేది ప్రణాళిక. ఇంతపెద్ద మొత్తం రుణం తక్కువ వడ్డీకి తీసుకోవాలంటే అంతర్జాతీయ బ్యాంకులు జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ వంటివైతేనే సాధ్యం. పలు అంతర్జాతీయ బ్యాంకులు నిధులు ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నట్లు హెచ్‌ఏఎంఎల్ అధికారులు తెలిపారు. కేంద్రం సావరిన్ గ్యారంటీ ఇవ్వాలి. ఏ బ్యాంకు నుంచి ఎంత రుణం తీసుకోవాలో కూడా కేంద్రమే నిర్ణయిస్తుంది. మిగిలిన 2 శాతం ప్రాజెక్టు వ్యయాన్ని పీపీపీ ద్వారా సేకరిస్తారు.

# కూల్చేటివి.. కూల్చనివి


హైదరాబాద్ : చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కుల సంరక్షణ కోసం ఈ ఏడాది జులై 19న రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ తేదీనే అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల భవిష్యత్తును నిర్ణయిస్తోంది. జులై నెలకు ముందు కట్టిన వినియోగంలోని ఇళ్లను కూల్చబోమని, తర్వాత కట్టిన నిర్మాణాలను కూల్చుతామని కమిషనర్ ఎ.వి.రంగనాథ్ ఇప్పటికే ప్రకటించారు. దీనిపై హైడ్రా తీసుకున్న విధానపర నిర్ణయాలను వివరిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు.

**వీటిని కూల్చుతాం..** రద్దయిన అనుమతులు చూపుతూ జులై తర్వాత నిర్మాణ పనులు కొనసాగిన ఇళ్లను కూల్చుతాం. ప్రభుత్వ భూములను ఆక్రమించి పేదలకు విక్రయిస్తున్న ఆక్రమణదారులపై కఠిన చర్యలుంటాయి. ఎలాంటి నిర్మాణమైనా, ఏ దశలో ఉన్నా.. కోర్టు నుంచి కూల్చివేత ఆదేశాలు వచ్చినప్పుడు ఆగేది లేదు.

హైడ్రా ఏర్పాటయ్యాక చెరువుల్లో చేపట్టిన నిర్మాణాలను కూల్చడంతో పాటు అనుమతి ఇచ్చిన అధికారిపై కేసు నమోదు చేస్తాం.


ఎలా గుర్తిస్తామంటే.. క్షేత్రస్థాయి పరిశీలన, గూగుల్ ఎర్త్ పటాలతో నిర్మాణం జులై నాటికి పూర్తయిందా, లేదో ప్రాథమికంగా గుర్తిస్తాం. లైడార్ సర్వే, రిమోట్ సెన్సింగ్ సర్వేలతో భూముల పటాలను పరిశీలిస్తూ సెన్సార్ల సాయంతో ఆక్రమణలను గుర్తించేందుకు జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రంతో ఒప్పందం చేసుకుంటున్నాం. పునరుజ్జీవానికి ప్రతిపాదనలు: ఇప్పటికే కూల్చివేతలు పూర్తయిన 12 చెరువులకు పునరుజ్జీవం కల్పించే ప్రతిపాదనలను పంపాం. 200 ఎకరాల భూమిని ఆక్రమణల విడిపించాం. 5వేల ఫిర్యాదులు విచారణలో ఉన్నాయి.

# ఉదయమే గిర్రుమంటోంది



హైదరాబాద్: విద్యుత్తు డిమాండ్ సాధారణంగా లైటింగ్ లోడ్ అధికంగా ఉండే సాయంత్రం వేళల్లో నమోదవుతుంది. చలికాలంలో నగరంలో ఇందుకు భిన్నంగా ఉదయం పూట గరిష్ఠంగా ఉంటోంది. ఆ సమయంలో పిల్లలు పాఠశాలలకు, పెద్దలు కార్యాలయాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుంటారు. ఉదయాన్నే మోటార్లు, హీటర్ల వాడకం అధికంగా ఉండటమే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. **15 నిమిషాలకోసారి నమోదు..** విద్యుత్తు పంపిణీ సంస్థ ప్రతి 15 నిమిషాలకు కరెంట్ డిమాండ్ రీడింగ్స్‌ను నమోదు చేస్తుంది. జీహెచ్‌ఎంసీలో ఈ నెల 16న నమోదైన గణాంకాల ప్రకారం.. ఉదయం 7.30 నుంచి 7.45 గంటల మధ్య గరిష్ఠంగా 2,929 మెగావాట్లు, సాయంత్రం 6 నుంచి 6.15 గంటల నడమ 2,900, తెల్లవారుజా మున 2.30 నుంచి 2.45 గంటల మధ్య 1,593 మెగావాట్లకు దిగువన డిమాండ్ ఉంటోంది.

# పైన చుక్‌చుక్.. కింద రయ్‌రయ్



హైదరాబాద్: మొదటిసారి డబుల్ డెక్కర్ పైవంతెనల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. ఎల్బీనగర్ నుంచి ఆరాంఘర్ వరకు ఉన్న ఇన్నర్ రింగు రోడ్డుపై ఇవి నాలుగు రానున్నాయి. నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ చౌరస్తా, శంషాబాద్ మీదుగా విమానాశ్రయం వెళ్లే 36.8కి.మీ పొడవైన మెట్రో రైలు మార్గంతో వీటిని అనుసంధానిస్తారు. కొత్తగా నిర్మించే పైవంతెనల వద్ద మాత్రం రెండో అంతస్తులో మెట్రో ఉంటుంది. ఇందుకోసం పిల్లర్లను ఎత్తుగా నిర్మించి మెట్రో మార్గానికి వదులుతారు. ఈ విధమైన అనుసంధానంతో.. మెట్రో కారిడార్ నిర్మాణ వ్యయం కొంత మేర తగ్గుతుంది. రహదారిపై స్థలం కలిసి వస్తుంది. ట్రాఫిక్ సమస్యకు 100శాతం పరిష్కారం లభిస్తుందని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. ఈ నాలుగు నిర్మాణాల అంచనా వ్యయం రూ.955కోట్లు. అందుకు సంబంధించి మెట్రో రైలు సంస్థ, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డిజైన్లను రూపొందించే పనిలో ఉన్నాయి.

**స్థలం.. నిధులు సద్వినియోగం..** ప్రస్తుతమున్న రోడ్డు మార్గంపై పైవంతెనలను నిర్మిస్తే వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయి. పైవంతెన నిర్మించాక.. అదే రోడ్డుపై మెట్రో రైలు మార్గాన్ని నిర్మిస్తే.. తొలగిపోయిన ట్రాఫిక్ సమస్య మళ్లీ పుట్టుకొస్తుంది. ఉదాహరణకు.. బేగంపేట విమానాశ్రయం కూడలి. గతంలో కూడలిలో పైవంతెన నిర్మించారు. కొన్నేళ్లకు పైవంతెన పక్కన మెట్రో మార్గం కోసం పిల్లర్లను నిర్మించారు. దీంతో బేగంపేట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే రోడ్డు మార్గం కుంచించుకుపోయింది. భవిష్యత్తులో మెట్రో రైలు మార్గం అవసరమున్న రహదారులపై డబుల్ డెక్కర్ పైవంతెనలను నిర్మిస్తే ప్రజాధనం, స్థలం సద్వినియోగం అవుతాయని నిపుణులు గుర్తుచేస్తున్నారు.

**రెండు మార్గాల్లో ప్రతిపాదించినా..**

నగరం నుంచి ఆదిలాబాద్, కరీంనగర్ వైపు వెళ్లే రెండు జాతీయ రహదారులపై ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి మార్చిలో శంకుస్థాపన చేశారు. ప్యారడైజ్ కూడలి నుంచి సుచిత్ర కూడలి మీదుగా కండ్లకోయ వరకు, జేబీఎస్ నుంచి తాడ్‌బండ్, అల్వాల్, తూముకుంట వరకు ఆరు లైన్ల పైవంతెనలను నిర్మించాలన్నది ప్రణాళిక. ఆయా మార్గాల్లో ఓఆర్ఆర్ వెలుపలి వరకు భవిష్యత్తులో మెట్రో సేవలను పొడిగించాలన్న ఆలోచనతో.. ఎలివేటెడ్ కారిడార్లతో మెట్రో మార్గాన్ని అనుసంధానిస్తామని సర్కారు అప్పట్లో ప్రకటించింది. డబుల్ డెక్కర్ పైవంతెనల మార్గానికి సంబంధించి హెచ్ఎండీఏ, మెట్రో రైలు సంస్థలు డిజైన్లపై కసరత్తు చేస్తున్నాయి.

**ఎక్కడెక్కడంటే..**

1) టీకేఆర్ కాలేజీ కూడలి, గాయత్రినగర్, మందమల్లమ్మ కూడళ్లు.
2) ఒమర్ హోటల్ నుంచి సోయబ్ హోటల్ వరకు వయా మెట్రో ఫంక్షన్‌హాల్ మీదుగా
3) బండ్లగూడ–ఎర్రకుంట క్రాసు రోడ్డు కూడలి మీదుగా
4) మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్డు, కాటేదాన్ కూడళ్ల మీదుగా

**ప్రణాళిక లోపంతో..** ఎల్బీనగర్ కూడలి, బైరామల్‌గూడ కూడలి, ఒవైసీ జంక్షన్, చాంద్రాయ ణగుట్ట జంక్షన్, హైటెక్‌సిటీలోని కొత్తగూడ జంక్షన్, గచ్చిబౌలి చౌరస్తా, జేఎన్‌టీయూ కూడళ్లలో పైవంతెనలు నిర్మించారు. ఎల్బీనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట వరకు ఎక్స్‌ప్రెస్‌వే పనులు పురోగతిలో ఉన్నాయి. ఆయా మార్గాలన్నింటిలో మెట్రో సేవలను విస్తరిస్తామని గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రకటించాయి. కానీ.. డీపీఆర్‌ను రూపొందించలేదు. రోడ్డు అభివృద్ధి పనుల్లో మెట్రో ప్రాజెక్టుకు స్థలం వదలాలన్న జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ సూచనలను పట్టించుకోకపోవడం.. ప్రణాళికా లోపాలకు అద్దం పడుతోంది.

# అందని ద్రాక్షగా రాయితీ పరికరాలు




కరీంనగర్ : దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంలా తయారైంది రైతుల పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా 7898 ఎకరాల్లో పండ్లు, కూరగాయలు, పూలు సాగు చేస్తున్న అన్నదాతలకు.. ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ద్వారా అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి వారికి అవసరమైన రాయితీ విత్తనాలు, పరికరాలు అందించాల్సి ఉంటుంది. అదేమి లేకపోవడంతో ఉద్యానశాఖ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. రాయితీ పరికరాలైన డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు ప్రభుత్వం ఈ ఏడాది జిల్లాకు 361 హెక్టార్లకు లక్ష్యం విధించింది. అయితే ఇప్పటివరకు 198.47 హెక్టార్లకు మాత్రమే మంజూరు చేశారు.

**మంజూరు ఇలా..**

పరికరాలకు అవసరమైన రైతులు తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఉద్యానశాఖ సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో రైతు పొలాన్ని పరిశీలించి ఎన్ని పైపులు పడుతాయనే వాటిపై ఆరా తీస్తారు. రాయితీ పోను మిగతా డబ్బు ఎంతో చెప్పి సంబంధిత డ్రిప్ పైపులు సరఫరా చేసే సంస్థకు డీడీ తీయించి పంపించాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో జిల్లా వ్యాప్తంగా జరగటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కానరాని అవగాహన సదస్సులు**

ఉద్యానశాఖ అధికారులు కూరగాయలు, పండ్లు, పూలు పండించే రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి.. శాస్త్రవేత్తల ద్వారా వారికి అవసరమైన సలహాలు, సూచనలు, రాయితీ విత్తనాలు, ఎరువులు, పరికరాలు, పంటకు తెగుళ్లు సోకితే ఏ పురుగుమందు వేయాలనేది అవగాహన కల్పించాలి. అయితే సదస్సులు నిర్వహించినట్లు కాగితాలకే పరిమితమవుతోందని రైతులు వాపోతున్నారు.

**దరఖాస్తు విధానం**

రాయితీ పరికరాల కోసం %www.tgmip.com% వెబ్‌సైట్‌లో పట్టాదారు పాస్‌బుక్, రైతు ఫొటో, ఆధార్, తాజా 1బి పహణీతో దరఖాస్తు చేయాలి. ఒకసారి రాయితీ పొందిన రైతులు ఏడేళ్ల వరకు తిరిగి పొందటానికి అనర్హులు. ఉన్నత వర్గానికి చెందిన రైతులకు 80 శాతం, బీసీలకు 90శాతం రాయితీతో అందజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ కల్పిస్తారు.


**డీడీలు పెండింగ్‌లో లేవు** గతంలో డీడీలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతం మా కార్యాలయం వద్ద పెండింగ్‌లో ఏమి లేవు. రైతులకు వంద శాతం న్యాయం చేస్తాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. శ్రీనివాసరావు, డీడీ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ

**నేనే కొనుగోలు చేసుకున్నా..**

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఎనిమిది నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. కార్యాలయానికి వెళ్లినప్పుడల్లా ఏదో కారణం చెప్పి పంపించేవారు. విసిగిపోయి రూ.1.60 లక్షలతో డ్రిప్ కొనుగోలు చేసి కూరగాయల తోటకు ఏర్పాటు చేసుకున్నా. మంద తిరుపతి, గోపాల్‌పూర్, కరీంనగర్ గ్రామీణం

# పాలన మారి.. వార్డులో అధికారి

నల్గొండ : తీసుకున్న నిర్ణయంతో ప్రజల వద్దకే పురపాలన రానుంది. వార్డుకో కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి నుంచి పట్టణ ప్రజలకు అవసరమైన సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్‌కి ఓ అధికారిని నియమించి అన్ని రకాల సేవలు అక్కడి నుంచే అందించడం విజయవంతంగా కొనసాగుతోంది. వీఆర్‌ఏల సర్దుబాటులో భాగంగా నల్గొండ జిల్లాలోని 8 పురపాలికల్లో సుమారు 62 మందిని వార్డు అధికారులుగా నియమించింది. తాజాగా కొత్త పురపాలికల్లో సైతం వార్డు అధికారుల పోస్టులు మంజూరు చేసి, గ్రూప్–4 ద్వారా నియమితులైన 77 మందిని నల్గొండ జిల్లాకు కేటాయించడంతో వారిని జిల్లా కలెక్టర్ 8 పురపాలికలకు కేటాయించారు. 60 రోజుల్లోపు వారంతా తమకు కేటాయించిన పురపాలికల్లో నియామక ఉత్తర్వుల ప్రతులను అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వార్డు అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించనున్నారు. పారిశుద్ధ్య సేవలు, సిబ్బందిపై పర్యవేక్షణ, మంచినీటి సరఫరా, ఆస్తి పన్నులు



వసూళ్లు, అక్రమ నిర్మాణాల గుర్తింపు, వాటిపై చర్యలు, వార్డు పరిధిలో ఆసరా పింఛన్ల పంపిణీ, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాలు స్థానికంగా అందించనున్నారు. వార్డు కార్యాలయంలో ప్రజలు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందించే బాధ్యతలు నిర్వహించనున్నారు.

# అర్థంతర పనులు.. రెట్టింపు కష్టాలు

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. 'మన ఊరు–మన బడి' పథకం కింద జిల్లాలోని 191 పాఠశాలల్లో సుమారు రూ.250 కోట్లతో పనులు ప్రారంభించినా నిధుల కొరతతో నిలిచిపోయాయి. ఇటీవల అమ్మ ఆదర్శ బడి కింద చేపట్టిన పనులదీ ఇదే పరిస్థితి. **12 రకాలు..** భారాస ప్రభుత్వ హయాంలో మన ఊరు–మన బడి పథకం కింద తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, అదనపు గదులు, వంట గది, ప్రహరీ, భవనాలకు రంగులు వేయడం, విద్యుత్తు, ఫర్నిచర్, పచ్చదనం పెంపు, భోజన గది, డిజిటల్ ల్యాబ్.. ఇలా 12 రకాల పనులు ప్రారంభించారు. రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సందిగ్ధం నెలకొంది. నిధులు రాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. ఈ ఏడాది అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా 545 చోట్ల మౌలిక వసతుల కల్పనకు రూ.29.63 కోట్లతో చేపట్టిన పనులు కూడా వెక్కిరిస్తున్నాయి. అసంపూర్తి పనులతో బోధనకు ఇబ్బంది ఏర్పడుతోంది. పలు పాఠశాలల్లో ఆరుబయట తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు.

సుల్తానాబాద్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి రూ.29 లక్షలు మంజూరయ్యాయి. గుత్తేదారు రూ.14.50 లక్షలు వెచ్చించి పలు పనులు చేసి, బిల్లులు రాకపోవడంతో ఆపేశారు. విద్యార్థులు తరగతి గదుల్లో, వరండాలో, చెట్ల కింద భోజనం చేయాల్సి వస్తోంది. దుర్గంధంతో విద్యార్థులకు అసౌకర్యంధర్మారం ఆదర్శ పాఠశాలకు రూ.13.61 లక్షలు మంజూరు కాగా మరుగుదొడ్లు, మూత్రశాలల మరమ్మతు, కిటికీలు, వెంటిలేటర్లకు దోమల జాలీలు, కుళాయిలు ఏర్పాటు చేయించారు. వసతిగృహం ముందు సెప్టిక్ ట్యాంకు నిర్మాణం చేపట్టగా ప్లాస్టరింగ్ చేసి పైపులైనుతో అనుసంధానించాల్సి ఉంది. పక్కనున్న తరగతి గదుల్లోకి భరించలేదని దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు తెలిపారు.

మరమ్మతు మమఇద్లాపూర్ ప్రాథమిక పాఠశాలకు రూ.4.40 లక్షలు మంజూరు కాగా పాత మరుగుదొడ్లకే మరమ్మతులు చేసి, ఎంబీ రికార్డు చేసినట్లు తెలుస్తోంది. తలుపులు సరిగ్గా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. నాసిరకంగా, తూతూ మంత్రంగా పనులు చేసి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి.

**రికార్డు చేసినా పైసా రాలే!** వడ్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.52 లక్షలు మంజూరు చేసింది. గుత్తేదారు బిల్లులు రాకపోవడంతో ఏడాది కిందట పనులు అర్థంతరంగా వదిలేశారు. రూ.15 లక్షలకు ఎంబీ రికార్డు చేసినా పైసా రాలేదని గుత్తేదారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తి పనులతో భోజన సమయంలో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. కలెక్టర్ ఆదేశించినా అంతే! బేగంపేట ఉన్నత పాఠశాల భోజనశాలలో విద్యుత్తు సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం పనులు చేపట్టగా అసంపూర్తిగా ఉన్నాయి. తరగతి గదులు, పాఠశాల ప్రహరీ నిర్మాణం, మైదానం సరిచేయడం వంటి పనులు జరగాల్సి ఉంది. గతంలో కలెక్టర్ శ్రీహర్ష పాఠశాలను సందర్శించి పనుల పూర్తిపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రూ.16 లక్షలు మంజూరు చేసినా గుత్తేదారు సమస్యతో పనులు జరగడం లేదు.

పిల్లర్లతో వదిలేశారు! గోపాల్‌పూర్(పెద్ద ఓదాల) ఎంపీపీఎస్ పాఠశాల భవనాన్ని పూర్తిగా తొలగించారు. తిరిగి పిల్లర్ల వరకు నిర్మించి అర్థంతరంగా వదిలేశారు. అడవిసోమన్‌పల్లి యూపీఎస్‌లో వంటగది, భవనం ప్లాస్టరింగ్, సింక్ పనులు ఇంకా పూర్తి కాలేదు. అర్థంతర పనులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

నోరు తెరిచిన సంపులుమండలంలోని 29 పాఠశాలల్లో పనులు చేపట్టగా కొన్ని చోట్ల పూర్తయినా చాలా చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. జిల్లెల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సంపు వద్ద పై కప్పు అసంపూర్తిగా వదిలేశారు. లక్కారం పంచాయతీ కాశిపల్లి బడిలో సంపుపై కప్పు వేయకపోవడంతో ఉపాధ్యాయుడు తాత్కాలికంగా చెక్కలు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో ఇబ్బందులు కుక్కలగూడూరు ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణం చేపట్టగా బిల్లులు రాక పనులు ఆగిపోయాయి. గోడల వరకు పనులు చేసి, పైకప్పు వేయకపోవడంతో వర్షాకాలంలో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద బోరు మోటారు నుంచి ట్యాంకు వరకు పైపులైను అనుసంధాన పనులు, వాష్‌బేసిన్‌కు నల్లాల కనెక్షన్‌తో పాటు టైల్స్ పనులు చేయాల్సి ఉంది.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

గోదావరిఖని : రామగుండం నగరపాలక ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల సుమారు రూ. కోటి వ్యయంతో కొనుగోలు చేసిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లను వినియోగంలోకి తేవడంతో పాటు నగరపాలక కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను తిరిగి అదే విభాగంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. నగరపాలక నిర్వహణపై సమీక్షించిన జిల్లా పాలనాధికారి ఈ మేరకు నగరపాలక పారిశుద్ధ్య విభాగం అధికారులకు మార్గదర్శనం చేశారు. సుమారు 40 మంది పారిశుద్ధ్య కార్మికులు నగరపాలక కార్యాలయంలో వివిధ విభాగాల్లో ఉన్నారు. వారిని తిరిగి యథావిధిగా పారిశుద్ధ్య విభాగంలోకి తీసుకొని పనులు చేయించాలని, నూతన వాహనాలను సైతం వాడుకలోకి తేవాలన్నారు. తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సంస్కరిస్తే ప్రయోజనకరం**

రామగుండం నగరపాలక సంస్థలోని పారిశుద్ధ్య విభాగంలో మొత్తం 447 మంది ఒప్పంద కార్మికులు ఉండగా అందులో డ్రైవర్లు, డ్రెయిన్ క్లీనర్లు, స్వీపర్లు, చెత్త ఎత్తే కార్మికులు ఉన్నారు. వీరిలో కేవలం 192 మంది పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణలో వినియోగించే ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలపై విధుల్లో ఉన్నారు. రామగుండం నగరపాలికలో ప్రస్తుతం 14 ట్రాక్టర్లు, 50 ఆటో ట్రాలీలు చెత్త సేకరణలో వినియోగిస్తుండగా ట్యాంకర్లు, బ్లేడ్ ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు, బొలెరో వాహనాలున్నాయి. వీటిపై మొత్తం 100 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. చెత్త సేకరణ విభాగంలో కొందరు డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారు ఉన్నారు. అలాంటి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చినట్లయితే కార్మికుల సంఖ్య పెరగకుండానే నూతనంగా కొనుగోలు చేసిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లను వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉంది. నగరపాలక కార్యాలయంలో పనిచేస్తున్న 40 మంది పారిశుద్ధ్య కార్మికులను తిరిగి అదే విభాగంలోకి తీసుకోవడంలో కార్మికుల కొరత సైతం తీరే అవకాశం ఉంది. పాత ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు సైతం తరచూ మొరాయిస్తుండటంతో ఆయా డివిజన్లలో చెత్త సేకరణ నామమాత్రంగా జరుగుతోంది. నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలను వినియోగంలోకి తేవడంతో పాటు పాత వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తే చెత్త సేకరణ నిత్యం జరిగే అవకాశముంది.



# కేసీఆర్ పదేళ్లు కష్టపడి కూలేశ్వరం కట్టారు..

హైదరాబాద్: రైతులను ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా విధివిధానాలపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. రైతు భరోసాపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. "రైతు సమాజాన్ని ఆదుకునేందుకు మా ప్రభుత్వం ముందు ఉంటుంది. గత ప్రభుత్వం రైతు బంధు అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ఈ పథకాన్ని తెచ్చారు. సాగులో లేని భూములకూ రైతుబంధు ఇచ్చారు. దీని ద్వారా రూ.22,600 కోట్ల ఆయాచిత లబ్ధి చేకూర్చారు. రియల్ ఎస్టేట్, పారిశ్రామికవేత్తలకూ ఇచ్చారు. రాళ్లకు, గుట్టలకూ రైతుబంధు ఇద్దామా..?" అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. రైతు భరోసా అమలు చేయడానికి సభ్యులంతా సలహాలు ఇవ్వాలని సీఎం కోరారు.

**భారాసను ఆదర్శంగా తీసుకోవాలా..? :** "జమీందార్లు, భూస్వాములకు రైతు బంధు ఇవ్వాలా..? మీరు ఇచ్చారు కాబట్టి.. మమ్మల్నీ రాళ్లు, గుట్టలకు రైతు బంధు ఇవ్వాలంటున్నారు. భారాసను ఆదర్శంగా తీసుకోవాలని అంటున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుంటే మేం కూడా ప్రతిపక్షంలోనే ఉండేవాళ్లం. 2023లో అధికారం.. 2024లో డిపాజిట్లు కోల్పోయిన మీరు మాకు ఆదర్శం కాదు. నిజమైన లబ్ధిదారులెవరికీ అన్యాయం జరగకూడదు" అని సీఎం అన్నారు.

**ఆ సంఘానికి అధ్యక్షుడు అసెంబ్లీకి రాలేదు..** "రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర తొలి స్థానంలో ఉంది. తెలంగాణ రెండో స్థానంలో ఉంది. భారాస పాలనలో 3 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు తగ్గించామని చెబుతున్నారు.
అబద్ధాలు చెప్పే సంఘానికి అధ్యక్షుడు అసెంబ్లీకి రాలేదు. ఆ సంఘానికి ఉపాధ్యక్షుడు అసెంబ్లీకి వచ్చారు" అని సీఎం ఎద్దేవా చేశారు.

**ఆ మొత్తాన్ని అదానీకి తిరిగిచ్చాం..** "స్కిల్ వర్సిటీ కోసం అదానీ రూ.100 కోట్లు ఇచ్చారు. దీనిపై ప్రతిపక్షం చేసిన నానాయాగీ వల్ల ఆ మొత్తాన్ని అదానీకి తిరిగి ఇచ్చాం.

రూ.100 కోట్లు తిరిగి ఇవ్వడం వల్ల రాష్ట్రానికి నష్టం. రెండు సార్లు సీఎం అయ్యి.. వందేళ్ల విధ్వంసం చేసి.. వెయ్యేళ్లకు సరిపడా మీరు సంపాదించుకున్నారు" అని సీఎం ఆరోపించారు. తొమ్మిదిన్నర ఏళ్ల భారాస పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పు చేశారని.. పదేళ్లు కష్టపడి కేసీఆర్ 'కూలేశ్వరం' కట్టారని సీఎం ఎద్దేవా చేశారు.



# బీమాపై నిర్ణయం మళ్లీ వాయిదా!

జైసల్మేర్: జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీ తొలగింపు సహా పలు అంశాలే ఎజెండాగా జీఎస్టీ కౌన్సిల్ సమావేశం శనివారం ప్రారంభమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో 55వ కౌన్సిల్ సమావేశానికి రాజస్థాన్‌లోని జైసల్మేర్ వేదికైంది. పలు వస్తువులపై రేట్ల హేతుబద్ధీకరణ, శ్లాబుల మార్పు వంటి అంశాలు ఇందులో చర్చకు రానున్నాయి. అయితే, జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్టీ తొలగింపు అంశాన్ని మండలి మరోసారి వాయిదా వేసింది. మరింత పరిశీలన అవసరం అని మండలి అభిప్రాయపడినట్లు తెలిసింది. ఆరోగ్య బీమా, టర్మ్ జీవిత బీమా పాలసీలపై జీఎస్టీని మినహాయించాలని పాలసీదారులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. దీనిపై ఏర్పాటైన మంత్రుల బృందం (జీఓఎం) నవంబర్‌లో సమావేశమై చర్చించింది. జీఎస్టీ తొలగించేందుకు నిర్ణయించింది. టర్మ్ పాలసీలు సహా పెద్దలు తీసుకున్న ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేసేందుకు మంత్రుల బృందం సుముఖత వ్యక్తం చేసింది. సాధారణ వ్యక్తులు తీసుకునే రూ.5 లక్షలలోపు ఆరోగ్య బీమా పాలసీలపైనా జీఎస్టీని మినహాయించాలని, రూ.5 లక్షలు దాటిన ఆరోగ్య బీమా పాలసీలకు ప్రస్తుత 18 శాతం జీఎస్టీని కొనసాగించాలని నిర్ణయించింది. దీనిపై ఆరంభంలోనే చర్చించిన కౌన్సిల్.. ఈ అంశాన్ని వాయిదా వేసింది. మరింత లోతైన చర్చ అవసరమని పలువురు సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు మంత్రుల బృందానికి నేతృత్వం వహించిన బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి తెలిపారు.

దీంతో సామాన్యులకు మరోసారి నిరాశే ఎదురైంది. ఇతర అంశాలపై మండలిలో చర్చ జరుగుతోంది.

# 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్లు నిరూపిస్తే మేమంతా రాజీనామా చేస్తాం: కేటీఆర్



హైదరాబాద్: సాగు విస్తీర్ణం పెరగాలనే ఉద్దేశంతోనే రైతుబంధు ఇచ్చామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (%ఖు=%) అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. "2019-20లో సాగు విస్తీర్ణం 141 లక్షల ఎకరాలుంది. 2020-21లో సాగు విస్తీర్ణం 204 లక్షల ఎకరాలని నివేదికలో చెప్పారు. రైతుబంధు ఇవ్వడం వల్లే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇదే విషయాన్ని ప్రభుత్వం ఇచ్చిన నోట్ స్పష్టం చేస్తోంది. 4.50 లక్షల మంది గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చాం. పోడు పట్టాలున్న గిరిజనులకు రైతుబంధు ఇస్తారో.. లేదో ప్రభుత్వం చెప్పాలి. రైతుబంధుకు కోతలు పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంది. లేకపోతే.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి గురించి మంత్రి చెప్పేవారు కాదు. తెలంగాణలో పీఎం కిసాన్ సమ్మాన్ 20 శాతం మంది రైతులకే వస్తోంది. రైతుబంధు యథాతథంగా ఇస్తామంటే.. ఈ చర్చ ఎందుకు? పత్తి, కంది 8 నెలల పంట.. ఆర్థిక సాయం ఒక పంటకు ఇస్తారా? రెండు పంటలకు ఇస్తారా అనేది ప్రభుత్వం చెప్పాలి. పామాయిల్, మామిడి, ఉద్యాన పంటలకు రైతుభరోసా ఇస్తారా? 3 పంటలు సాగు చేసే రైతులకు మూడు విడతలుగా ఇస్తారా? మూడో పంటకు ఇవ్వాలని గతంలో రేవంత్ అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పది రోజులు పొడిగించాలి. ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథపై చర్చ చేపట్టాలి. నల్గొండ జిల్లా అభివృద్ధిపై కూడా ఒకరోజు చర్చ చేపట్టాలి. గతంలో జరిగిన తప్పులు ఎత్తిచూపితే మీకు ఇబ్బందిగా ఉంది. గతంలో చేపట్టిన ప్రాజెక్టులకు మాత్రం డబ్బా కొట్టడం సబబా? భారాస హయాంలో 24 గంటల విద్యుత్ ఇవ్వలేదని తప్పుదోవ పట్టిస్తున్నారు. భారాస పాలనలో సగటున 19.2 గంటల విద్యుత్ ఇచ్చినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. కాంగ్రెస్ పాలనలో 24 గంటలు ఇస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారు. సభ వాయిదా వేసి నల్గొండ జిల్లాకు వెళ్లి పరిస్థితులు పరిశీలిద్దాం. 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్లు చూపెడితే భారాస శాసనసభాపక్షం మొత్తం రాజీనామా చేస్తుంది. రైతుబంధు మీద కాంగ్రెస్ విపరీతమైన దుష్ప్రచారం చేసింది. రైతు బతుకును మార్చిన గేమ్ ఛేంజర్ రైతుబంధు" అని కేటీఆర్ అన్నారు.



# దట్టమైన మంచులోనూ కవచ్‌తో రైట్ రైట్

రైల్వే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం రైళ్లలో ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ (కవచ్)ను అందుబాటులోకి తీసుకొస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం కొన్ని మార్గాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నారు. ఈ వ్యవస్థ చాలా సమర్థంగా పనిచేస్తోందని ఇప్పటికే కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ పలుమార్లు వెల్లడించారు. తాజాగా కవచ్ పనితీరుకు సంబంధించిన ఓ వీడియోను ఆయన పోస్ట్ చేశారు. కవచ్ వ్యవస్థ సాయంతో దట్టమైన పొగమంచులోనూ పట్టాలపై రైలు దూసుకెళ్తున్న వీడియో అది. ఇక, లోకో పైలట్ బయటకు చూడకుండానే కవచ్ సాయంతో సిగ్నల్ సమాచారం తెలుసుకోవచ్చని కేంద్రమంత్రి రాసుకొచ్చారు. సాధారణంగా విపరీతమైన పొగమంచు ఉన్నప్పుడు లోకో పైలట్‌కు ఒక్కోసారి సిగ్నల్ కూడా కన్పించని పరిస్థితి నెలకొంటుంది. అలాంటి సమయంలో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువ. ఇప్పుడు కవచ్‌తో ఆ సమస్య ఉండబోదని రైల్వే మంత్రి వివరించారు. ఈ వ్యవస్థ సాయంతో బయట ఏం సిగ్నల్ పడిందనేది క్యాబిన్‌లోని మానిటర్‌పైనే లోకో పైలట్ చూసుకోవచ్చు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

# అల్లు అర్జున్‌పై అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన కామెంట్స్..



హైదరాబాద్, డిసెంబర్ 21: పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా అల్లు అర్జున్ వ్యవహార శైలిని ప్రస్తావించారు. పుష్ప-2 మూవీ విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందినా హీరో సినిమాను చూసి వెళ్లారని విమర్శించారు. దుర్ఘటనపై బాధ్యత లేకుండా సినిమా చూసి వెళ్లేటప్పుడు అభిమానులకు చెయ్యి ఊపుతూ వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ బాధ్యతారహిత్యంగా వ్యవహరించారని విమర్శించారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

# మీకొచ్చిన ఇబ్బంది ఏమిటీ సీఎం చంద్రబాబు గారు..



విజయవాడ, డిసెంబర్ 21: మహిళలకు ఫ్రీ బస్ పథకం అమలుపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. కాలయాపన తప్పా ఇచ్చిన హామీ నిలబెట్టుకునే బాధ్యత ఈ ప్రభుత్వంలో కనిపించడం లేదన్నారు. అధికారం చేపట్టి.. ఈ ఆరు నెలల్లో పండుగలు, పబ్బాలు పేరు చెప్పి ఈ పథకం అమలును దాటవేశారంటూ కూటమి ప్రభుత్వంపై వైఎస్ షర్మిల నిప్పులు చెరిగారు. కొత్త బస్సులు కొంటున్నామంటూ ఇన్నాళ్లూ చెప్పుకొచ్చారని.. కానీ ప్రస్తుతం మంత్రి వర్గ ఉప సంఘం పేరుతో మరికొన్ని రోజులు సాగతీతకు సిద్ధమయ్యారని ఆమె విమర్శించారు. శనివారం విజయవాడలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబును కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తోందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంలో ఇన్ని బాలారిష్టాలు ఎందుకు ? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె సూటిగా నిలదీశారు. చిన్న పథకం అమలకు కొండత కసరత్తు దేని కోసమంటూ ఈ పథకం అమలుపై చంద్రబాబు అనుసరిస్తున్న వైఖరిపై సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఈ పథకం అమలు చేసి చూపించారని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల గుర్తు చేశారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు.. ప్రస్తుతం ఉన్న బస్సుల్లోనే మహిళలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారన్న విషయాన్ని సైతం వైఎస్ షర్మిల ప్రస్తావించారు. ఈ పథకం అమలును బట్టి అదనపు ఏర్పాట్లను కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు చేసుకున్నాయని వివరించారు. జీరో టిక్కెట్ల కింద నెలకు రూ.300 కోట్లు ఆర్టీసీకి ఇవ్వడానికి మీ ప్రభుత్వం వద్ద నిధులు లేవా? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును ఈ సందర్భంగా వైఎస్ షర్మిల నిలదీశారు.

**మీకు మనస్సు రావడం లేదా? :** మహిళల భద్రతకు మీకు మనసు రావడం లేదా ? అంటూ సీఎం చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. ఈ పథకం అమలుకు తాము ఎప్పుడైనా సిద్ధంగానే ఉన్నామని ఆర్టీసీ యాజమాన్యం చెబుతోంటే మీకొచ్చిన ఇబ్బంది ఏమిటంటూ సీఎం చంద్రబాబును వైఎస్ షర్మిల నిలదీసే ప్రయత్నం చేశారు. కనీసం నూతన సంవత్సర కానుకగా అయినా.. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ సీఎం చంద్రబాబుకు వైఎస్ షర్మిల సూచించారు. ఈ హామీ విషయంలో మీ చిత్తశుద్ధి ఏమిటో నిరూపించుకోవాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.




# మీ ఆటలు సాగవిక.. సినీ ఇండస్ట్రీకి సీఎం వార్నింగ్..

హైదరాబాద్, డిసెంబర్ 21: సినిమా ఇండస్ట్రీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఇకపై టికెట్ ధరల పెంపు, బెనిఫిట్‌షోలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. తాను సీఎంగా ఉన్నంత కాలం అనుమతి ఇవ్వబోనని తేల్చి చెప్పారు. తాము అధికారంలో ఉన్నంత కాలం సినిమా వాళ్ల ఆటలు సాగనివ్వనని వార్నింగ్ ఇచ్చారు. సినిమా వాళ్లు వ్యాపారాలు చేసుకోండన్న సీఎం.. మనుషుల ప్రాణాలతో చెలగాటం ఆడాలని చూస్తే ఊరుకోమని తేల్చి చెప్పారు. చట్టం అందరికీ ఒక్కటే అనే విషయం గుర్తుంచుకోవాలని హితవు చెప్పారు. హీరో అల్లు అర్జున్ అరెస్ట్ తర్వాత కొన్ని రాజకీయ పార్టీలు పైశాచికంగా ప్రవర్తించాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. పలువురు నాయకులు చేసిన కామెంట్స్‌ను ఆయన అసెంబ్లీలో ఉటంకించారు. తనను నీచంగా తిట్టుకుంటూ పోస్టులు పెట్టారన్నారు. మంత్రిగా పని చేసిన ఒక వ్యక్తి అడ్డగోలుగా పోస్టులు పెట్టారన్నారు. సదరు హీరో భగవత్ స్వరూపుడు అన్నట్లుగా హంగామా చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రిని తిట్టడానికి నీచమైన భాషను వాడారన్నారు. ప్రజల ప్రాణాలు తీస్తుంటే కూడా వాళ్లను ఏం చేయొద్దా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. స్టార్, ఫిల్మ్ స్టార్స్, సూపర్ స్టార్స్, పొలిటికల్ స్టార్స్‌కు ప్రత్యేక ప్రివిలేజ్ ఉందా? అని సీఎం ప్రశ్నించారు. సినిమా వాళ్లు హత్యలు చేసినా విచారణ చేయొద్దంటూ చట్టం చేద్దామా? అని అసెంబ్లీలో ప్రశ్నించారు సీఎం రేవంత్.

# ఉత్తరాంధ్రలో వర్షాలపై వాతావరణ శాఖ కీలక ప్రకటన



విశాఖపట్నం, డిసెంబర్ 21: గత మూడు రోజులుగా ఉత్తరాంధ్రలో వర్షాలు దంచికొడుతున్నాయి. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాలకు పంటలు నీటమునిగాయి. చేతికి వచ్చిన పంట ఇలా నీటిపాలు అవడంతో రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడం ప్రభావంతో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో మూడు రోజులు ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. బలమైన గాలులు వీచాయి. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలహీనపడుతోందని వాతావరణ శాఖ అధికారులు గుడ్ న్యూస్ చెప్పారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని.. వాయుగుండం ఈశాన్య దిశగా కదులుతోందని తెలిపారు. రాగల 24 గంటల్లో వాయుగుండం బలహీన పడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో వర్షాలు తగ్గుముఖం పడతాయన్నారు. ఉత్తరకోస్తా జిల్లాల్లో చెదురు మధురుగా వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే తీరం వెంబడి 35 నుంచి 45 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. సముద్రంలో అల్లకల్లోలం కారణంగా మత్స్యకారులు వేటకు వెళ్లారాదని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అలాగే పోర్టులకు మూడవ నెంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందన్నారు. కాగా.. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా విజయనగరం జిల్లా బొండపల్లిలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. బీమిలి సహా పలు ప్రాంతాల్లో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అలాగే విశాఖలో 4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

# శాసనసభను ఇలా ఆలస్యంగా నడపడం కరెక్ట్ కాదు.. స్పీకర్‌కు హరీశ్‌రావు సూచన

హైదరాబాద్ : శాసనసభను పది నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించడంపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ అనుమతితో మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. సమయం 10:10 కావొచ్చింది. ఈ సెషన్‌లో ఏ ఒక్క రోజు కూడా అసెంబ్లీ పది అంటే పది గంటలకు ప్రారంభం కాలేదు. మీరు లాస్ట్ సెషన్ చూడండి.. పదేండ్లు సభ నడిపితే.. పది అంటే పది గంటలకు కచ్చితంగా ఠంచన్‌గా సభ నడిపాం. సభ సమయ పాలన పాటించడం ముఖ్యం. ప్రతి రోజు ఈ సెషన్‌లో 5, 10, 15 నిమిషాలు ఆలస్యంగా సభ ప్రారంభం కావడం కరెక్ట్ కాదు. సభ అందరికీ ఆదర్శంగా ఉండాలి. మనమే ఇలా ఆలస్యంగా నడపడం కరెక్ట్ కాదని మనవి చేస్తున్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు. అనంతరం స్పీకర్ అనుమతితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ ప్రారంభించారు. రైతు భరోసా విధివిధానాలపై సూచనలు ఇవ్వాలని మంత్రి తుమ్మల సభ్యులను కోరారు. సంక్రాంతి పండుగ నాటికి రైతు భరోసాపై విధివిధానాలను ఖరారు చేసి, ఆ తర్వాత రైతు భరోసా చెల్లింపులు చేస్తామని మంత్రి ప్రకటించారు.

# పటాన్‌చెరు పరిధిలో భారీగా డ్రగ్స్ పట్టివేత



పటాన్‌చెరు అర్బన్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలో భారీగా డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. కిలో ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు, యాంటీ నార్కోటిక్స్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్, టీజీ నాబ్ ఎస్పీ సాయి చైతన్య వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకల కోసం డ్రగ్స్ విక్రయించేందుకు రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర నిందితులను పట్టుకున్నామన్నారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ శివారులో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం సాయంత్రం టీజీ నాబ్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 1000 గ్రాముల నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీరిద్దరూ డ్రగ్స్ కేసులో నిందితులుగా గుర్తించారు. ముంబయికి చెందిన మహమ్మద్ సలీం అబ్దుల్ హమీద్ షేక్, ముఖేష్ దుబేలుగా పోలీసులు గుర్తించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS, ALUGUNOOR(V),TiMMAPOOR(M), KARIMNAGAR DISTRICT, TELANGANA "PUBLISHED FORM,HNO.5-2-107,OSMANPURA, JAGITYALA DISTRICT, JAGITYALA, TELANGANA -RNI NO.APTEL/2011/39782 PH.NO :- 9848999998